అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
గురువారం 09 ఫిబ్రవరి 2023

లింగంపేట్ తహసీల్దార్‌గా చంద్ర రాజేశ్వర్

నవతెలంగాణ-లింగంపేట్

మండల తహసీల్దార్‌గా చంద్ర రాజేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు లింగంపేట్ తహసీల్దార్‌గా పనిచేసిన మారుతి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కాగా లింగంపేట్ డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాలు జారీ చేయడంతో ఆయన పూర్తి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండలంలోని నాయకులు, మండల వీఆర్ఏలు రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ బాధ్యతతో పని చేయాలని వివరించారు.


బాధ్యతలు స్వీకరించిన చంద్రరాజేశ్వర్

స్పీకర్‌ను, మంత్రిని కలిసిన కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజీవ్ గాంధీ హన్మంతు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లో అసెంబ్లీలో ఇరువురి చాంబర్‌లలో కలిసి మొక్కలు బహూకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.


స్పీకర్, మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం మొక్కలు అందజేసిన కలెక్టర్


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

పోడు భూములకు
పట్టాలు సిద్ధం చేయండి

- ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అందించేలా ప్రక్రియను పూర్తి చేయాలి
- మలి విడుత సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పోడు భూములకు సంబంధించిన ప్రక్రియను ఈ నెల 15 వ తేదీ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా, నిర్దేశిత గడువుకంటే ముందే అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలు వెలువడిన వెంటనే అర్హులైన వారికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్ హాల్‌లో ఆర్ఓఎఫ్ ఆర్ జిల్లా స్థాయి కమిటీ మలి విడత సమావేశం నిర్వహించారు. పోడు భూములకు సంబంధిం చి వచ్చిన క్లెయిమ్‌లు, క్షేత్ర స్థాయిలో జరిపిన పరిశీలన వివరాలు, గ్రామ సభల తీర్మానాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. డివిజనల్ స్థాయి కమిటీలో ఆమోదం పొందినప్పటికీ పలు సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉండిపోయిన క్లెయిమ్‌లను రెండు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. వీటితో పాటు తిరస్కరించిన క్లెయిమ్‌లను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి అర్హత కలిగి ఉన్న వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. జిల్లా స్థాయి కమిటీకి చేరిన నివేదికలను సత్వరమే పరిశీలన చేయాలని, క్లెయిమ్‌ల ఆమోదం లేదా తిరస్కరణకు గురైన వాటికి సంబంధించి స్పష్టమైన ఆధారాలను పొందుపర్చాలని సూచించారు. క్లెయిమ్‌ల పరిశీలన వివరాలను పక్కాగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా కంప్యూటరీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్ణీత డిజైన్‌లో పట్టా పాస్ బుక్కుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, బి.చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగూరావు, ఆర్డీఓలు రవి, రాజేశ్వర్, శ్రీనివాస్, అటవీ శాఖ అధికారులు, జిల్లా కమిటీ సభ్యులైన భీంగల్, మోపాల్, సిరికొండ మండలాల జెడ్పిటీసీలు చౌట్పల్లి రవి, కమలా బానోత్, మాలావత్ మాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పశుమిత్రలను పట్టించుకోరే..

- సర్కారు నుంచి కనీస వేతనం కరువు
- 8 యేండ్లుగా గ్రామాల్లో పశువులకు ఉచిత సేవలు
- రైతుల నుంచి డబ్బు తీసుకోవాలని ప్రభుత్వ సలహా
- సర్కారు జీతం ఇస్తుంటే మేం ఎందుకు ఇస్తామని రైతుల నిలదీత
- ఆర్థిక కష్టాల్లోకి పశుమిత్రలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామాల్లో మూగజీవులకు చికిత్సలు అందజేస్తున్న పశు మిత్రలను సర్కారు పట్టించుకోవడం లేదు. ఎనిమిదేండ్లుగా గ్రామాల్లో సేవలు అందజేస్తున్నా కనీస వేతనం అమలు చేయడం లేదు. పీఎఫ్, ఈఎస్ఐ ఊసేలేదు. 'సర్కారు ఒక సంవత్సరం కాకున్నా మరో సంవత్సరమైనా కనికరించి వేతనాలు ఇవ్వబోదా' అన్న ఆశతో పశుమిత్రలుగా చేరిన వందలామంది మహిళలు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక కష్టాల్లో మునిగిపోయారు. వేతనం ఇవ్వకపోవడమే కాకుండా పైపెచ్చు రవాణా, పశువులకు మందుల ఖర్చులు సైతం పశుమిత్రలే భరించాలని సర్కారు చెప్పడం కొసమెరుపు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల వ్యాప్తంగా మొత్తం 120 మంది వరకు పశుసంవర్ధక శాఖలో పశుమిత్రలుగా పని చేస్తున్నారు. వీరంతా గత 8 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. ఐకెపి ద్వారా ట్రెనింగ్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పారితోషికాలు నిర్ణయించకుండా పశు వైద్య శాఖలో పశు మిత్రులుగా నియమించింది. వీరంతా తన ఊరుతో పాటు సబ్ సెంటర్ పరిధిలోని రైతులకు సంబంధించిన ఆవులు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు ఇతర మూగ జీవాలకు చికిత్సలు అందజేయాలి. అందులో ముఖ్యంగా కృత్రిమ గర్భధారణ, వ్యాక్సిన్, టీకాలు వేయటం, నట్టల మందు వేయటం, శస్త్ర చికిత్సలు, గాలి కుంటు వ్యాధి, పొచ్చమ్మ వ్యాధి, దొబ్బ వ్యాధి తదితర సేవలను పశు మిత్రలు అందిస్తున్నారు. 10వ తరగతి విద్యార్హతగా నిర్ణయించినప్పటికీ.. జిల్లాలో పీజీ, బీఈడీ చేసిన మహిళలు సైతం పశుమిత్రలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే సర్కారు నియామకం సమయంలోనే పారితోషకాలు ఇవ్వబోమని, మీరు చేసే సేవలకు రైతుల నుంచి డబ్బులు తీసుకోవాలని సూచించింది. ఇంత వరకు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో అసలైన సమస్యలు మొదలయ్యాయి. స్వంత గ్రామంలో చికిత్సలు చేసి డబ్బులు అడగలేని పరిస్థితి ఒకవైపు. లేదా ఇతర గ్రామాల్లో చికిత్సలు అందించిన సమయంలో రైతులను డబ్బులు అడిగితే 'మీకే సర్కారు వేలల్లో జీతాలు ఇస్తుంటే మా దగ్గర ఇంకా డబ్బులు అడుగుతున్నారా?' అని రైతుల నుంచి ఆగ్రహాలు, ఛీదరింపులు ఎదురయ్యాయి. దీంతో చాలా ఏండ్లుగా చికిత్సలు చేస్తున్నా డబ్బులు అడగడమే మానేశారు. అయితే రాష్ట్ర సర్కారు నియమించిన విధుల్లో ఉంటే ఏదో ఒక సంవత్సరం అయినా తమకు పారితోషకాలు నిర్ణయించి, ఇతర సదుపాయాలు కల్పిస్తుందని చాలా మంది ఆశపడ్డారు. కానీ గడిచిన 8 సంవత్సరాలుగా పశుమిత్రల ఆశలు అడియాసలయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రావడం లేదు. పైగా పశుమిత్రలుగా చాలా మంది వెనుకబడిన తరగతులకు చెందిన పేద మహిళలే ఉన్నారు. ప్రతిరోజూ చికిత్సల పేరిట గ్రామాలు తిరగడం, ఖాళీ కడపుతో ఇంటికి రావడం మాములయ్యింది. విధులు చేస్తున్నా నయాపైసా ఇంటికి రావడం లేదు. దీంతో చాలా మంది ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. ఇప్పటికైనా సర్కారు కనీస వేతనం నిర్ణయించి, యూనిఫాంతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని పశుమిత్రలు కోరుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని సర్కారును కోరుతున్నారు.


ఫైల్

కనీస వేతనాలు ఇవ్వాలి
మౌనిక, సిరికొండ మండలం



పశుమిత్రగా ఎనిమిది సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్నాం. కానీ సర్కారు నుంచి పైసా వేతనం రావడం లేదు. మా సేవలను సర్కారు గుర్తించి ఇప్పటికైనా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. ఇతర సదుపాయాలు కల్పించాలి. చాలా అధ్వాన్న పరిస్థితుల్లో పని చేస్తున్నాం. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాం.

మహిళలతో వెట్టిచాకిరి సిగ్గుచేటు
నుర్జహాన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



రాష్ట్ర సర్కారు మహిళా కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవడం సిగ్గుచేటు. కనీస వేతనాలు నిర్ణయించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేసి హక్కులు సాధించుకుంటామని హెచ్చరిస్తున్నాం.

యంచ గోదావరిలో సూసైడ్‌లు ఆగట్లే

- ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని కాపాడిన యంచ యువకులు

నవతెలంగాణ-నవీపేట్

యంచ గోదావరిలో సూసైడ్‌లు ఆగడం లేదు. ఆర్మూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన హైదర్ కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది బుధవారం బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా గమనించిన స్థానిక యువకులు వినోద్, రాజు అతనిని పట్టుకొని కాపాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి ఇంటికి పంపించారు. గత నెల రోజుల వ్యవధిలోనే గోదావరిలో ఐదుగురు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు విధితమే. ఈ విషయమై యంచ సర్పంచ్ ఆర్ అండ్ బి మంత్రితో పాటు కలెక్టర్, సిపీలకు విన్నవించినా స్పందన కరువైందని స్థానికులు వాపోతున్నారు. కాబట్టి ఇప్పటికైనా గోదావరిలో ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని కోరుతున్నారు.


బాధిత వ్యక్తిని కాపాదాని యువకుడు

'బతుకుపోరు'లో బాల్యం

నవతెలంగాణ-భిక్కనూర్

పొట్టకూటీ కోసం బాల్యం బంధీ అవుతోంది. పలక బలపం పట్టి స్కూల్లో చదువుకోవాల్సిన ఓ బాలుడు.. బిక్షాటనతో రోడ్డుపై నిలబడి బతుకు కోసం పోరాడుతున్నాడు. భిక్కనూర్ పట్టణ కేంద్రంలో రేణుకా మాత ఆలయ జాతరలో ఓ బాలుడు ఒంటికి సిల్వర్ పెయింట్ పూసుకొని గాంధీ వేషధారణలో బిక్షాటన చేశాడు. పొట్టకూటి కోసం గుజరాత్ రాష్ట్రం నుంచి ఓ కుటుంబం హైదరాబాద్ వలస వచ్చి బొమ్మలు అమ్ముకుంటూ జీవిస్తుంది. కాగా ఇక్కడ జాతర ఉన్న సమాచారం రావడంతో కుటుంబీకులు వచ్చి బొమ్మలు విక్రయించగా.. బాలుడు గాంధీ వేషదారణతో బిక్షాటన చేస్తూ కనిపించాడు.



31వ డిస్ట్రిబ్యూటర్ కాలువకు మరమ్మతులు చేపట్టాలి

- సీపీఐ(ఎం) డిమాండ్.. ఆర్ఐకి వినతి

నవతెలంగాణ-వర్ని

మండలం లోని వారాంతపు సంత పక్కన ఉన్న 31వ డిస్ట్రిబ్యూటర్ కాలువకు మరమ్మ తులు చేపట్టాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌కు సీపీఐ(ఎం) నాయకులు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఉమ్మడి మండల ఏరియా కన్వీనర్ నన్నేసాబ్ మాట్లాడుతూ.. రైతులకు సాగునీరు అందించేందుకు డిస్ట్రిబ్యూటర్ 31వ కాలువకు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథాగా ఇండ్లలోకి వస్తుందని పేర్కొన్నారు. కాలువలో చెత్త చెదారం చేరి ఉండటంతో మరుగు నీరుగా ఏర్పడి చుట్టుపక్కల కుటుంబాలకు దుర్వాసన వస్తుందని, వెంటనే ఇరిగేషన్ అధికారులు కాలువను శుభ్రపరిచి సాగునీరు రైతులకు చేరేలా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో అధికారులకు విన్నవించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు లక్ష్మి, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

పంటలు ఎండుతున్నయ్

- నిజాంసాగర్ డీ46 కాలువకు నీటిని విడుదల చేయాలి
- సాటాపూర్ చౌరస్తాలో ఆయకట్టు రైతుల రాస్తారోకో

నవతెలంగాణ-ఎడపల్లి

నిజాంసాగర్ డి46 కాలువకు నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువకు నీటిని విడుదల చేసి తమ పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్ వద్ద బుధవారం రైతులు రాస్తారోకో చేపట్టారు. డీ 46 కాలువ ద్వారా ఎడపల్లి, రెంజల్, జైతాపూర్, చిన్నమావంది, పెగడపల్లి తదితర గ్రామాల రైతులకు సాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. గత వారం రోజుల నుండి నాటిన వరి పంటలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండు ముఖం పడుతున్నాయని వాపోయారు. నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా రైతుల చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ఆ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మాటల్లో చెబుతున్నారే తప్ప చేతుల్లో మాత్రం చేసి చూపడం లేదని మండిపడుతున్నారు. ప్రస్తుతం నాటు వేసిన వరి పంటలు కొన్ని గ్రామాలలో కరువు దశలు ఉన్నాయని రైతులు తెలిపారు. కనీసం బోరు ద్వారా నీటిని సరఫరా చేద్దామని భావించిన కరెంట్ సరిగ్గా సరఫరా చేయడం లేదని అన్నారు. 24 గంటలు నిరంతర కరెంట్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో కనీసం తొమ్మిది గంటలు సైతం నిరంతరాయంగా కరెంట్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు విడుతలుగా కరెంట్ ఇస్తుండటంతో పంట పొలాలు పారడం లేదని తెలిపారు. ఎండాకాలం రాకముందే ఇప్పటినుండి బోర్ బావుల వద్ద కరెంటు కోతలు ఉన్నాయని, దీనికి తోడు నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు నీటి సరఫరా కావడం లేదని తెలిపారు. చివర ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను అడిగితే అది కామరెడ్డి జిల్లా పరిధిలోకి వస్తుందని మాట దాటి వేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. విషయం తెలుసుకున్న బోధన్ ఆర్డీవో రాజేశ్వరరావు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. నిజాం సాగర్ ప్రధాన కాలువ ద్వారా చివరి ఆయకట్టువరకు పది రోజులపాటు నీటిని సరఫరా చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ఆందోళనను విరమించుకున్నారు. అంతకు ముందుగా బోధన్ ఎసిపి కిరణ్ కుమార్ తో పాటు ఎడపల్లి ఎస్సై పాండేరావు అక్కడికి చేరుకొని ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఎడపల్లి, జైతాపూర్, రెంజల్, పెంటకలన్ గ్రామాల రైతులు ఆందోళనలో పాల్గొన్నారు.


రాస్తారోకో చేపట్టిన రైతులు

అరకొర నిధులతో
విద్యారంగం అభివృద్ధి ఎలా..?

- విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతుల దహనం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్/కంఠేశ్వర్

అరకొర నిధులతో ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి ఎలా సాధ్యమని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ మాట్లాడుతూ తెలంగాణ యూనివర్సిటీలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నా కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించు కోకుండా బడ్జెట్‌లో ఎలాంటి ప్రత్యేక కేటాయిం పులూ చేయలేదని తెలిపారు. సంక్షేమ హాస్టల్స్ భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తు ండటంతో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను రూ.3000కు పెంచాలని డిమాండ్ చేశారు. మొత్తం బడ్జెట్ రూ.2,90,396 కోట్లలో విద్యారంగానికి కేవలం రూ.19,093 కోట్లకే (6.57 శాతానికే) పరిమితం చేయడం విద్యారంగం పట్ల ప్రభుత్వ వైఖరి అర్ధమవు తుందని అన్నారు. వీటిలో పాఠశాల విద్యాశాఖకు కేవలం 16,092 కోట్లు (5.54 శాతం) ఉన్నత విద్యకు 3,001 కోట్లు (1శాతం) కేటాయించారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు, విశ్వ విద్యాలయాల అభివృద్ధి గురుకులాల అభివృద్ధి, మన ఊరి మన బడి లాంటి ముఖ్య పథకాల అమలుకు ఈ నిధులు ఏ మాత్రమూ సరిపోవని, అరకొర నిధులతో విద్యారంగం మరింత బలహీనపడనుందని, కావున ప్రభుత్వం విద్యా రంగానికి కేటాయించినటువంటి బడ్జెట్ పైన మళ్లీ సమీక్షించి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, బాలికల కన్వీనర్ వర్షిని, నాయకులు అనిల్, అర్చన, అవినాష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించడం సరికాదని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీఐ కాలేజి నుండి ర్యాలీగా వెళ్లి బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 6.57 శాతం మాత్రమే కేటాయించారని, వీటితో సమగ్ర విద్యాభివృద్ధి ఎలా సాధ్యపడుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు దీపికా నగర నాయకురాలు శైలజ, స్వాతి, భవాని నగర నాయకులు ఉదయ్, రాజ్ కుమార్, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో బడ్జెట్ ప్రతులు దహనం చేసి నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు



నిజామాబాద్ ఐటీఐ కాలేజీ ఎదుట..

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి

- ట్రెయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్


విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

నవతెలంగాణ-సదాశివనగర్

పదవ తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని ట్రెయినీ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. బుధవారం సదాశివనగర్ ఆదర్శ పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్ ప్రక్రియ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా బాలికల వసతి గృహాన్ని సైతం సందర్శించి మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భానుమతి, మండల విద్యాధికారి యోసేపు, ఎంపీడీవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18న కంఠేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు

సాంస్కృతిక కళాకారులకు ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని నీలకంఠేశ్వర స్వామి దేవస్థానం కంఠేశ్వర్‌లో ఈనెల 18న మహాశివరాత్రి జాతర, బ్రహ్మోత్సవము నిర్వహించానున్నట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వేణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి రోజున జాగరణ, నిశి పూజా మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆదివారం 'మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శివరాత్రి జాగరణ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనేందుకు కళాకారులకు ఆహ్వానం పలికారు. ఆసక్తిగల కళాకారులు కంఠేశ్వర్ దేవాలయంలో సంప్రదించి కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

రూ.50లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



తిర్మన్ పల్లి గ్రామ దత్త సాయి మందిరానికి 50 లక్షల రూపాయలు మంజూరు చేసినట్టు నిక సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే నివాసంలో ప్రొసీడింగ్ పత్రాన్ని ఆలయ కమిటీ సభ్యులకు, సర్పంచ్‌కు అందజేశారు.

ఆడపిల్లలకోసం సుకన్య సమృద్ధి యోజన

- తపాలా అసిస్టెంట్ సూపరిండెంట్ సురేఖ

నవతెలంగాణ-ఆర్మూర్

బేటీ బచావో.. బేటీ పఢావో అనేది దేశవ్యాప్తంగా బాలికలకు సహాయపడే కేంద్ర ప్రభుత్వ పథకం అని, సుకన్య సమృద్ధి యోజన ఖాతా అని తపాలా అసిస్టెంట్ సూపరిండెంట్ యా పారూ సురేఖ బుధవారం తెలిపారు... ఈ పథకం తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, వివాహ ఖర్చుల కోసం ఒక క్రమపద్ధతిలో పొదుపు చేయడానికి దోహద పడుతుందని, తద్వారా ఆడపిల్ల తన తల్లిదండ్రులపై భారం అనే భావన తొలగించబడుతుందని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశ జనాభాలో పది సంవత్సరాల లోపు ఆడపిల్లల సంఖ్య సుమారు 8 కోట్లు. ఇప్పటి లెక్కల ప్రకారం అది సుమారుగా 12 కోట్ల వరకు ఉంటుందని అంచనా. కానీ ఇప్పటివరకు సుకన్య ఖాతాలు తీసుకున్న ఆడపిల్లల సంఖ్య కేవలం 2 కోట్ల 60 లక్షలు. అనగా ఈ పథకం పూర్తి స్థాయిలో అందరూ బాలికలకు అందట్లేదని తెలిపారు. పథకం గురించి బాలిక తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం అయి ఉండొచ్చని, పేదరికం కారణం కావొచ్చని పేర్కొనానరు. ఇలాంటి వారి కోసం ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రత్యేకంగా సుకన్య ఖాతాలు తెరవడం కోసం ఈనెల 9, 10 తేదీల్లో అమృతీ ఫ్యాక్స్ మహామేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దగ్గరలో ఉన్న తెలిసిన వారు ఎవరైనా 10 సంవత్సరాలలోపు బాలిక తల్లిదండ్రులు ఈ ఖాతాను తీసుకోకపోయి ఉంటే వారు ఈ పథకాన్ని వినియోగించు కునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. సుకన్య ఖాతాను కేవలం 250 రూపాయలతో ప్రారంభించవచ్చని, పేదరికం వల్ల ఎవరైనా బాలిక తల్లిదండ్రులు ఈ ఖాతాని తెరవకపోయి ఉంటే అలాంటి బాలికల కోసం ఎవరైనా దాతలు ముందుకు వచ్చి బాలిక తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం చేసి కేవలం 250 రూపాయలతో ఈ ఖాతాను ప్రారంభించవచ్చని తెలిపారు. ఎందుకంటే ఈ ఖాతాను ప్రారంభించాలంటే బాలిక వయస్సు 10 సంవత్సరాలు మించకూడదు ఒకవేళ పది సంవత్సరాలు మించిన తర్వాత వాళ్ళ దగ్గర డబ్బులు ఉన్నా కూడా ఖాతాను ప్రారంభించడానికి అనర్హులవుతారని పేర్కొన్నారు.





సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డుప్రనులను ప్రారంభించిన పిట్లకృష్ణ మహారాజ్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ మండలం గాంధీనగర్ తండా మల్లారం శివారులోగల శ్రీ లింగేశ్వర ఆశ్రమం దేవాలయానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు పనులను జడ్పీటిసి బోల్లంక సుమలత గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో లింగేశ్వర ఆశ్రమం స్వామి పిట్ల కృష్ణ మహారాజ్ బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ కవిత నిధుల నుండి ఐదు లక్షల రూపాయలను మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ నాయక్, జడ్పీటీసీ బొల్లెంక సుమలత గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు, ఎస్టీసెల్ మండల అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, సర్పంచులు అనూష లక్ష్మణ్ నాయక్, నగేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాయిడి బాలరాజ్, మల్లారం పార్టీ అధ్యక్షులు గాజుల శంకర్ , గాంధీనగర్ పార్టీ అధ్యక్షులు మారయ్య ఉప సర్పంచ్ గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన డివిజన్ వీఆర్ఏలు



కలెక్టర్‌ను కలిసిన వీఆర్ఏలు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాకు ఇటీవల వచ్చేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును డివిజన్‌లోని వీఆర్ఏల సంఘ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించినారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పృథ్వీరాజ్ ,ప్రధాన కార్యదర్శి రోడ్డ సాయన్న ,నందిపేట్ మండల అధ్యక్షులు ముత్యం ,ప్రధాన కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

యంచలో స్పటిక లింగ పున: ప్రతిష్టాపన

నవతెలంగాణ -నవీపేట్

మండలంలోని యంచ కేదారేశ్వర ఆలయంలో స్పటిక లింగ పున:ప్రతిష్టాపన మహోత్సవం రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం బ్రహ్మశ్రీ శ్రౌతి మురళీధర్ శర్మ స్పటిక లింగ పున్హ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జనార్ధన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ చేతుల మీదుగా కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తొర్తి కి 4, తడపాకల్ 6, ఏర్గట్ల 1, బట్టాపూర్ 1, దోంచందకు 2 మొత్తం 14 చెక్కులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, పత్తిరెడ్డి ప్రకాష్, కట్కం పద్మాసాగర్, కోఆప్షన్ సభ్యుడు అష్రాఫ్ పాల్గొన్నారు.

యువతరాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన 2023 - 24 బడ్జెట్లో దేశ ప్రగతిని సాధించాల్సిన యువతరాన్ని పూర్తిగా విమర్శిస్తున్నామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి అన్నారు. బడ్జెట్ ప్రతులను డీవైఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌టీఆర్ చౌరస్తాలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర బడ్జెట్లలో పూర్తిగా యువత ప్రస్తావన రాకపోవడం అవమానకరమని అన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది యువత డిగ్రీలు, పిజీలు, పూర్తిచేసుకుని నిరుద్యోగ సమస్యతో ప్రభుత్వం వైపు చూస్తున్న పరిస్థితుల్లో యువత అభివృద్ధికి, ఉపాధి కల్పన, స్వయం ఉపాధి కల్పన రుణాలకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాల్సింది పోయి విస్మరించడం దుర్మార్గపు చర్య అన్నారు. గ్రామాల్లో యువతకు ఉపాధిగా ఉన్న ఉపాధి చట్టానికి 2లక్షల40వేల కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. కానీ కేవలం 60 వేల కోట్లు మాత్రమే కేటాయించడం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర కాదా.. అని ప్రశ్నించారు. యువత అభివృద్ధికి సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్లో లేకపోవడం బాధాకరం అన్నారు. దేశ ప్రగతిని సాధిస్తాం అభివృద్ధిలో పూర్తి సాధికారతను సాధిస్తాం అని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వాలు యువతరాన్ని ప్రోత్సహించకుండా ఏవిధంగా సాధిస్తాయని ప్రశ్నించారు. యువతని విస్మరించిన ఈ బడ్జెట్ పూర్తిగా నిరుపయోగమైనదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిట్ల నరేష్ ,ఉపాధ్యక్షులు సాయి ,కిరణ్, సహాయ కార్యదర్శి రాహుల్, నాయకులు మారుతి ,బాలు, నవీన్లు పాల్గొన్నారు.



బడ్జెట్ కేటాయింపులపై నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

విజయ్ హైస్కూల్ లో ఫుడ్‌ఫీట్, క్రాఫ్ట్ మేళా

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక విజయ్ హైస్కూల్లో ఫుడ్‌ఫీట్, క్రాఫ్ట్‌మేళా బుధవారం పాఠశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూకిరణ్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆహారం ప్రాముఖ్యత, సమతుల్యంలేని ఆహారం తీసుకున్నట్టయితే వచ్చే వివిధ రకాల జబ్బుల గురించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. విద్యార్థుల సృజనాత్మక శక్తిని, వారిని ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. అనంతరం ఫుడ్‌ఫీట్‌లో భాగంగా 6వ తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసి స్టాళ్లలో స్వీట్లు, స్నాక్స్, జ్యూస్, రైస్, మిర్చి, సమోస, గప్‌చుప్ మొదలైన ఆహార పదార్థాల రుచులను ఆస్వాదించారు. 7వ తరగతి విద్యార్థులు క్రాఫ్ట్, క్లే వస్తువులను పరిశీలించి వారి నైపుణ్యతను మెచ్చుకోవడమే కాకుండా తనకు నచ్చిన క్రాఫ్ట్‌ను కొనుగోలు చేశారు. కూరగాయలను, పండ్లను ఉపయోగించి వివిధ రకాల జంతువులను, పక్షులను, పువ్వులను ఎంతో అందంగా, ఆకర్షణీయంగా తయారుచేశారని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి డా. అమృతలత మాట్లాడుతూ.. విద్యార్థులు వారి మాతృమూర్తులకు వంటలో సహాయం చేయాలని, అమ్మ కష్టాన్ని అర్థం చేసుకొని వివిధ రకాల వంటలు తయారుచేయమని తల్లులను వేధించవద్దని, తల్లిదండ్రులకు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ విజేత, 6,7 తరగతుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న మేయర్ నీతూ కిరణ్



కూరగాయలతో తయారు చేసిన క్రాఫ్ట్‌ను కొనుగోలు చేస్తున్న మేయర్

తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-ముప్కాల్

నిరంతరం రైతులకు అందించే త్రీ ఫేస్ కరెంటు ఇష్టానుసారంగా సరఫరా చేస్తున్నారంటూ ముప్కాల్ కు చెందిన బీజేపీ మండల నాయకులు బుధవారం తహసీల్దార్ విక్రమ్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు ముస్కు నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతుల కన్నీళ్ళు తుడుస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వ్యవసాయ రంగానికి తూట్లు పొడుస్తున్నారని గుర్తుచేశారు. 24 గంటల పాటు రైతులకు త్రీ ఫేజ్ కరెంటు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అన్నివర్గాలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

- కంటి వెలుగు.. బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమం
- హాత్‌సే హాత్ జోడోలో మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రజలు, రైతులు, గిరిజనులు, దళితులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందని కాంగ్రెస్ నిజామాబాద్ రూరల్ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం జక్రాన్‌పల్లి మండల పరిధిలో బుధవారం నిర్వహించిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి హాజరయ్యారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కంటి వెలుగు కేవలము బీఆర్ఎస్ పార్టీ ప్రచారం కోసమేనని అన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి కేవలం 50 రూపాయల కంటి అద్దాలను రీడింగ్ గ్లాసులను అందజేసి కంటి అద్దాల బాక్స్ పైన సీఎం కేసీఆర్ బొమ్మ పెట్టి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భూపతిరెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం 2014, 2018 మేనిఫెస్టోలో విడుదల చేసిన పథకాలు ఇంతవరకు 90శాతం అమలు కాలేదని అన్నారు. మేనిఫెస్టో ఆధారంగా ఎటువంటి అభివృద్ధి జరగలేదని స్థానిక ఎమ్మెల్యేకు ఛాలెంజ్ చేస్తూ ఓపెన్‌గా జక్రాన్‌పల్లి బస్టాండ్‌లో అభివృద్ధిపై చర్చ జరుపుదామని పేర్కొన్నారు. జిల్లాలో రైతులు బోర్ వెల్స్ వేస్తున్నారంటే సాగునీరు అందకనే వేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు జీవన భృతి ఇవ్వడం లేదని, రెండు సంవత్సరాలుగా దళిత బంధు ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు. ఇటీవల మునుగోడు ఎలక్షన్లో గిరిజనులకు గిరిజన బంధు అన్నారు.. బడ్జెట్లో ఎక్కడా కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కరెంటు సమస్యతో రైతులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగా రెడ్డి, సీనియర్ నాయకులు శేఖర్ గౌడ్, డిసిసి కార్యదర్శి భాస్కర్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, చిన్నారెడ్డి, లక్ష్మణ్, రవి, శ్రీనివాస్ గౌడ్, నరేష్, వినోద్, అక్బర్, అరుణ్, రమేష్, అభి, కనక రవి, సాయిరెడ్డిరమేష్, అభి, కనక రవి, సాయరెడ్డి, బాలయ్య, మోహన్ నాయక్, బాలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

రుణమాఫీపై మోసం చేస్తున్న కేసీఆర్

- వైయస్సార్ తెలంగాణ పార్టీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రుణమాఫీపై కేసీఆర్ మోసం చేస్తున్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇన్‌ఛార్జి పాట్కూరి తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తానని కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి బహిరంగ సభల్లో ప్రచార సభల్లో చెప్పారని పేర్కొన్నారు. 90 వేల వరకే రుణమాఫీ చేస్తానని బడ్జెట్లో పెట్టారని, ఇది అన్యాయమని తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పినట్టు లక్ష వరకు రుణమాఫీ చేయాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే రైతులతో నిరసన చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థినిలకు బహుమతుల ప్రదానం



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

నవతెలంగాణ - ముప్కాల్

బాలికల దినోత్సవం పురస్కరించుకుని ముప్కాల్ లయన్స్ క్లబ్, పోలీసుల ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం వివిధ అంశాలపై పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన బాలికలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థినిలు చదువుతో పాటు అనేక కార్యక్రమాలలో పాల్గొని అటు తల్లిదండ్రులకు, ఇటు పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. క్రీడల్లో సైతం రాణించి ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్వో వినోద, లయన్స్ క్లబ్ అధ్యక్షులు విక్రమ్, చాకు లింగం, కనకయ్య, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వ సమాజ్ అధ్యక్షునికి సన్మానం



సన్మానంచేస్తున్న విజయభారతి

నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజు నూతనంగా పట్టణ సర్వసమాజ్ అధ్యక్షులుగా నియామకమైనందుకు ఆలూర్ గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఆలూర్ గంగారెడ్డి కూతురు విజయ భారతి బుధవారం పట్టు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపినారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీసీటీయూ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, బీసీటీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందించి స్వాగతం పలికారు. అనంతరం బీసీటీయూ డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ, అసోసియేటడ్ అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, డిచ్‌పల్లి మండలం అధ్యక్షులు కొట్టాల రామకృష్ణ, మాక్లూర్ మండల బిసిటియు అధ్యక్షులు గంగోనె సంజీవ్, రాష్ట్ర గౌరవ సలహాదారులు రమణ స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి నర్సయ్య, విజయ్ కుమార్‌పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం



బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన లోలం గజేందర్‌ను మండల బీఆర్ఎస్ పార్టీ బుధవారం నాయకులు పరామర్శించారు. స్థానిక పెట్రోల్ బంకులో పనిచేసే గజేందర్ మూడు రోజుల క్రితం పని ముగించుకొని ఇంటికి వస్తుండగా రామానంద స్వామి ఆశ్రమం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయాలైన ఆయన నిరుపేద కావడంతో బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రిలో పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు కమ్మర్ పల్లి పార్టీ తరపున రూ. 31 వేల 500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్, రైతు విభాగం మండల అధ్యక్షుడు బద్దం రాజశేఖర్, నాయకులు సంత రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అపురూపలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో గల అపురూప వెంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అమృత లత తెలిపారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నర్సరీలలో మొక్కల సంరక్షణ నిరంతరం చేపట్టాలి

- ఏపీడీ సంజీవ్ కుమార్

నవతెలంగాణ-బోధన్

ప్రతి గ్రామంలోని నర్సరీలలో నాణ్యమైన మట్టితో మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు చేపట్టాలని, అంతే కాకుండా మొక్కలు ఎదిగేలా సంరక్షణ చేపట్టాలని ఏపీడీ సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని లంగ్డాపూర్, భూలక్ష్మి క్యాంప్ గ్రామాలలోని నర్సరీలను పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపుదలకు సిబ్బంది చేస్తున్న విధానంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల వారీగా ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను పెంచాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ అల్తాఫ్, సర్పంచ్ పవన్ ఉన్నారు.

మినీస్టేడియం స్థలం పరిశీలన

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణాన్ని మినీ స్టేడియం ఏర్పాటు నిమిత్తం ఆ స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం పరిశీలించారు. మినీ స్టేడియం ఏర్పాటుతో స్థానిక, చుట్టుపక్కల మండల గ్రామాల యువతకు ఉపయోగకరంగా ఉంటుందని మండల కార్యదర్శి, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, మండలాధ్యక్షులు గిరి పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విట్టల్, పంచాయతీరాజ్ పీఆర్ఏ గంగాకిరణ్, సీనియర్ నాయకులు మేక వీర్రాజు, పీఏసీఎస్ చైర్మన్ నామాల సాయిబాబా, ఉప సర్పంచ్ కంది కృష్ణ, మైనార్టీ అధ్యక్షులు ఎజాజ్, సత్యనారాయణ, ఎంపీడీవో బషీరుద్దీన్ గ్రామపెద్దలు తదితరులున్నారు.

చెదలు పడుతున్న 'సేంద్రియం'

- అలంకారప్రాయంగా వర్మి కంపోస్టు షెడ్డు
- చెత్త తరలిస్తలే.. ఎరువు తయారు చేస్తలే

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామాన్ని పరిశుభ్రతగా ఉంచడంలో భాగంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయించి పంచాయతీలు ఆదాయం పెంపొందించుకోవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్డులు చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. సరిపడా సిబ్బంది లేక, ఊరికి దూరంగా షెడ్డు నిర్మించడం, నిర్వహణపై ఆసక్తి చూపకపోడం తదితర కారణాలతో మూలకు పడ్డాయి. ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్టు షెడ్లు పనికిరాకుండా పోతున్నాయి.

పల్లెల్లో పారిశుధ్యం లోపించకుండా తడిపొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా చర్యలు చేపట్టి, సేకరించిన తడిచెత్తతో ఎరువు తయారు చేసి విక్రయిస్తూ గ్రామపంచాయతీలు ఆదాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంపోస్టు షెడ్డుల నిర్మాణం చేపట్టింది. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.2.50 లక్షలతో వీటిని నిర్మించింది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీల్లో రూ. 13 కోట్ల 15 లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టింది. జీపీ ఆధ్వర్యంలో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. అయితే చాలా పంచాయతీలు వీటి నిర్వహణకు దూరంగా ఉన్నాయి. పలు చిన్న జీపీలు



నిరుపయోగంగా మారిన కంపోస్టుషెడ్



కంపోస్టు షెడ్‌లో చెత్తను వేరు చేసే ప్రాంతం

ఇప్పటికే సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. పలు మేజర్ పంచాయతీల్లో సరిపడా సిబ్బంది ఉన్నా.. ఊరికి దూరంగా నిర్మించడం, నిర్వహణపై పట్టింపు లేకపోవడం తదితర కారణాలతో షెడ్డులను ఉపయోగించుకోవడం లేదు. దీంతో షెడ్డు చుట్టూ చెత్త చెదారం పేరుకుపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది.

లింగంపేట్ మండలంలో చూస్తే.. మండలం వ్యాప్తంగా 41 గ్రామపంచాయతీలకు గాను కేవలం ఐదారు జీపీలు కంపోస్టు షెడ్డులను ఉపయోగించుకొని ఎరువును తయారు చేస్తున్నాయి. పొల్కంపేట్, నల్లమడుగు, జల్దిపల్లి, శెట్పల్లి, శెట్పల్లి సంగారెడ్డి, మోతేతో తదితర గ్రామాల్లో నిర్వహణ సక్రమంగా చేపడుతున్నా.. మిగతా గ్రామాల్లో మూలకు పడుతున్నాయి. మోతేలో తయారు చేసిన ఎరువును.. జీపీ ఆధ్వర్యంలో నాటిన మామిడి చెట్లకు ఉపయోగించడంతో ప్రస్తుతం అవి పూత దశకు వచ్చినట్టు సర్పంచ్ ఏలేటి రామారెడ్డి తెలిపారు. షెట్పల్లి సంగారెడ్డిలో తయారు చేసిన ఎరువును నర్సరీ మొక్కలకు వాడుకుంటున్నారు.

కానీ మిగతా గ్రామాలు మాత్రం ఎరువు తయారీకి దూరంగా ఉంటున్నాయి. గ్రామంలో సేకరించిన చెత్తను అటవీ ప్రాంతానికో, లేకుంటే డంప్‌యార్డుకు తరలిస్తూ నిప్పు పెడుతున్నారు. దీంతో ఎరువు తయారీ లక్ష్యం నెరవేరడం లేదు.

మా దృష్టికి రాలేదు

గ్రామపంచాయతీలో సేంద్రియ ఎరువులు తయారు చేయకుంటే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు గ్రామపంచాయతీలో సేంద్రియ ఎరువులు తయారు చేయడం లేదని తమ దృష్టికి రాలేదు. ఎరువులు తయారు చేస్తే గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తుంది. విస్మరించరాదు. **- శ్రీనివాసరావు. డిపివో. కామారెడ్డి**

ఏఎంసీ కమిటీ చైర్మన్‌కు సన్మానం


నాగ్‌నాథ్ పటేల్‌ను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన నాగ్‌నాథ్ పటేల్‌ను శ్రీ మహాలక్ష్మి మున్నూరుకాపు పటేల్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను బుధవారం శాలువ కప్పి సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గంటరాజ ప్రసాద్, జనరల్ సెక్రెటరీ, హైకోర్టు అడ్వకెట్ నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులు కర్రొల్ల గోపి, సభ్యులు పులి సంతోష్ కుమార్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగుల్లలో కంటి వెలుగు టీమ్‌కు సన్మానం



కంటివెలుగు టీమ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని చిన్నగుల్లాలో కంటివెలుగు టీమ్‌ను సర్పంచ్ శోభా, ఉప సర్పంచ్ జీజాబాయి బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శోభా మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అదేవిధంగా క్యాంప్ ఆఫీసర్ డా.విక్రమ్ కుమారుడి పుట్టినరోజు కావడంతో గ్రామస్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంప్ ఆఫీసర్ ఎమ్ఎల్ హెచ్‌పీ రాందాస్, ప్రశాంత్, డీఈవో రాకేష్, ఏఎన్ఎం సవిత, పెద్దఎడ్గి సవిత, ఆశాలు శ్రీదేవి, లక్ష్మీ తాహేర్ బీ, సురేఖ, కృష్ణాబాయి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, బీఆర్ఎస్ నాయకుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జుక్కల్

వ్యవసాయ శాఖ క్యాలెండర్‌ను జుక్కల్ సర్పంచ్, బీఆర్ఎస్ మండల నాయకులు ఆవిష్కరించినట్టు ఏవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని క్లస్టర్లలో అగ్రికల్చర్ శాఖ క్యాలెండర్‌లను గ్రామ రైతు సమన్వయ సమితి సభ్యులకు పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బొంపెలి రాములు, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు గంగునాయక్, వివిధ గ్రామాల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శివాజీ పటేల్, మనోహర్ పటేల్, రాజు, ఏవో, బీఆర్ఎస్ నాయకుడు నీలు పటేల్, ఏఈవోలు రాజ్యలక్ష్మీ, విజయ, శ్వేత, గజానన్ తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి విధానంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కృష్ణమూర్తి

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని బ్రమ్మాన్‌పల్లి గ్రామంలో పద్మపనీ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో రైతులకు వరి పంటలో తడి పొడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ మండల సమన్వయ కర్త పట్లోల్లా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. రైతులు వరి పంటలో తడి పొడి విధానం అవలబించడం వల్ల వరి పంటలో దోమ పోటు తగ్గడం, అధిక పిలకలు, దిగుబడి పెరగడం వంటి ఉపయోగాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి పట్లోళ్ల కృష్ణమూర్తి, సర్పంచ్ లక్ష్మి బాలయ్య, వీఆర్ఏ వెంకట్ స్వామి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల నర్సింలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బీస గణేష్, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని మోటాట్‌పల్లి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా వరి, మొక్కజొన్న, ఇతర కూరగాయల పంటలలో వస్తున్న ఆకుపచ్చ పురుగు, ఆకు ముడత, పేను దోమ లాంటి తెగుళ్లను నివారించడానికి, మొక్కజొన్నలో వస్తున్న కత్తెర పురుగు ఉధృతిని నివారించడానికి డ్రోన్ ద్వారా పిచికారీ చేయడంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు రంజిత్, భూపతి, వ్యవసాయ విస్తీర్ణ అధికారి అఖిలేష్, రాజిరెడ్డి, యాడవరెడ్డి, భూమయ్య, గోపాలరెడ్డి, రాజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎంత పని చేస్తే అంతకూలీ

- జుక్కల్ ఎంపీడీవో నరేష్

నవతెలంగాణ-జుక్కల్

ఎంతపని చేస్తే అంత కూలీ వస్తుందని జుక్కల్ ఎంపీడీవో నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దఎడ్గి, బిజ్జల్‌వాడి గ్రామాలలో ఉపాధిహామీ కూలీలు చేస్తున్న పనిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరేష్ మాట్లాడుతూ.. గ్రామాలలో కూలీల సంఖ్య పెంచాలని, గ్రామ సభలో ఆమోదం పొందిన వాటినే చేయించాలని లేకుంటే కూలీ డబ్బులు రావని పేర్కొన్నారు. అదేవిధంగా పెద్దఎడ్గిలో ఎఫ్ఏ సుభాష్‌తో కలిసి కూలీలకు మరుగుదొడ్లపైన ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిజ్జల్‌వాడి ఎఫ్ఏ హన్మంత్, పెద్దఎడ్గి ఎఫ్ఓఏ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సౌకర్యాలు కల్పించాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేరుకు జిల్లా ఆసుపత్రిగా చలామణి అవుతున్నా, రోగులకు కనీసం ఉపయోగపడే పరికరాలు అందుబాటులో లేవని అన్నారు. గర్భిణులకు వైద్యం చేయడంలో వైద్యులు అందుబాటులో లేరని అన్నారు.

గర్భిణీలకు స్కానింగ్ సౌకర్యం లేకపోవడంతో ప్రయివేటులో వేల రూపాయల ఖర్చుచేసి నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమీప గ్రామాల నుంచి వందల సంఖ్యలో రోగులు వస్తున్నా ప్రయోజనం లేదని అన్నారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ వైద్యులను పర్మినెంట్ చేసి నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోధన్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నా.. పేదలకు వైద్యం అందని పరిస్థితి ఉందని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందజే శారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ బడు, వహీద్, ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ సాయి కృష్ణ, హినాయత్ అలీ, జహీర్ అమీన్, రిజ్వాన్, శంకర్, మద్దెల రాజు, విలాస్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ అభివృద్ధికి స్పీకర్ ఎనలేని కృషి

- బీఆర్ఎస్ చందూర్ మండలాధ్యక్షులు అంబర్ సింగ్

నవతెలంగాణ-వర్ని



బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉండడం ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని, స్పీకర్ బాన్సువాడ అభివృద్ధి ఎనలేని కృషి చేస్తున్నారని చందూర్ బీఆర్ఎస్ మండలాధ్యక్షులు అంబర్ సింగ్ తెలిపారు. బుధవారం నవతెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్నీ నియోజకవర్గాల కంటే బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి బాటలో ఉందని.. చెప్పారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని డబుల్ బెడ్ రూములు కేవలం బాన్సువాడ నియోజకవర్గంలో పదివేల ఇండ్లు నిర్మాణం చేయించటం స్పీకర్‌కే దక్కిందన్నారు. పలు జిల్లాల ఎమ్మెల్యేలు ఆశ్చర్యపోయే విధంగా బాన్సువాడ నియోజకవర్గంలో అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్న ప్రదాత పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని పేర్కొన్నారు.

రైతు కష్టాలను తెలిసిన రైతుబిడ్డ..

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాలలో రైతులు నీటి కష్టాలను ఎదురుకోకుండా లిఫ్ట్ ఇరిగేషన్లను ఏర్పాటు చేయడం ఇక్కడి రైతుల అదృష్టమన్నారు. చెరువులను రిజర్వాయరులుగా మార్చి ఆయకట్టు ప్రాంత రైతులకు కూడా నీరు అందేలా రైతుకు అండగా ఉంటున్నారని తెలిపారు. మధ్యతరగతి, పేద ప్రజలకు గూడు, కూడు కల్పించి, రైతు కష్టాలను కూడా తన కష్టాలుగా భావించి నియోజకవర్గంలోని చెరువులను, కుంటలను రిజర్వాయర్లుగా మార్చి మూడు పంటలు సాగు చేసుకునే విధంగా రైతును ఆదుకుంటున్నారని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుంటే దీక్ష

- భారతీయ కిసాన్ సంగ్ మండలాధ్యక్షులు చాట్ల గోపాల్

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు వారం రోజుల్లో ఏర్పాటు చేయకపోతే రైతులకు అండగా భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటానని భారతీయ కిసాన్ సంగ్ మండలాధ్యక్షులు చాట్ల గోపాల్ అన్నారు. శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని వారం రోజుల్లోగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంగ్ నాయకులు చాట్ల గోపాల్ మాట్లాడుతూ.. వ్యవసాయ రైతులు శనగ పంటకు మద్దతు ధర లేక భారీగా నష్టపోతున్నారని ఈ పంటతో పాటు కంది, ధనియాల పంటకు మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్‌కు ప్రభుత్వం వారం రోజుల్లోగా మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ కమిటీ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అలాగే శనగ, ధనియాలు అలాగే కంది ధాన్యాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బహుజన స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బాలు ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి విట్టల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మద్నూర్ మండల రైతులు బోయిన్‌వార్ మాణిక్, మెత్రివార్ సాయి, రజంగ్లావర్ సందీప్, సోట్కేవార్ రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తాం

- బిచ్కుంద ఏడీఏ నూతన్ కుమార్

నవతెలంగాణ-మద్నూర్

శనగ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామని బిచ్కుంద ఏడీఏ నూతన్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మద్నూర్ రైతువేదికలో రైతు బంధు సమితి క్యాలెండర్‌ను మండలాధ్యక్షులు దిగంబర్‌రావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, రైతులు తమ పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.5330 కల్పించనున్నట్టు వివరించారు. మండలంలోని 9 క్లస్టర్ల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

- ఎంపీపీ గాల్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

గ్రామాలను అభివృద్ధి చేయడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని ఎంపీపీ గాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయ సమీపంలో రూ.2లక్షల ఎంపీటీసీ నిధులతో వేసిన బోర్ మోటారును పట్టణ సర్పంచ్ తునికి వేణుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సరస్వతి సువర్ణ ప్రభాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ బోడ నరేష్, ఆలయ కమిటీ చైర్మన్ అందే మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబల్ల మల్లేశం, ఎంపీటీసీ ఉప్పల బాబు, వార్డు సభ్యులు కమ్మరి సుజాత, సిద్ధి రాములు, ప్రజా ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


కంటివెలుగును పరిశీలిస్తున్న ఎంపీపీ

కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీపీ..

మండల కేంద్రంలో కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీపీ గాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నేత్ర పరీక్షలు చేయాలని, ప్రజలకు కంటి పరీక్షలపై మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తునికి వేణు, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ బోడ నరేష్, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంబల్ల మల్లేశం, నాయకులు సరస్వతి ప్రభాకర్, పంచాయితీ కార్యదర్శి సదాశివ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం

- కాంగ్రెస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి
- పలు గ్రామాల్లో 'హత్ సే హత్ జోడో'యాత్ర


ప్రభుత్వాల మోసాలను వివరిస్తున్న సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం నిర్వహించిన హత్ సే హత్ జోడో కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. మండలంలోని చద్మల్‌తండా, చద్మల్, నౌసిరం తండా, దుబ్బ తండా, నేరల్, నాగ్లూర్, నాగ్లూర్ తండా, నెరల్ తండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ హత్ సే హత్ జోడో పాదయాత్రను కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇస్తూ పాదయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, డీజిల్, పెట్రోల్ సామాన్య మానవునికి అందుబాటులోఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై గెలిచి టీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయిన సురేందర్‌కు రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా బుద్ధి చెప్తామని అన్నారు. కావున కార్యకర్తలందరూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మదర్, వెంకట్‌రెడ్డి, కామెల్లి బాలరాజు, లైన్ రమేష్, సంగెం రాజు, జశ్వంత్‌గౌడ్, చిమ్మని సాయిలు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని డాక్టర్ దేవేందర్‌రావు ప్రయివేట్ ఆస్పత్రిలో హైదరాబాద్‌కు చెందిన యశోద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీటీసీ సభ్యులు తీగల తిరుమల్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ శికే శ్రీనివాస్, వైద్యులు దేవేందర్‌రావు, ఆస్పత్రికి చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు

కల్యాణలక్ష్మీ.. పేదింటి కుటుంబాలకు వరం



నవతెలంగాణ-పిట్లం

కల్యాణలక్ష్మి పేదింటి కుటుంబాలకు ఓ వరం లాంటిదని ఎంపీపీ కవిత విజయ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో 42 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లచ్చిరెడ్డి, సర్పంచ్ విజయ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సాగౌడ్, నాయకులు శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.

వరిలో అగ్గితెగుళ్లను అరికట్టాలి

- మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్

నవతెలంగాణ-రామారెడ్డి

వరిలో వచ్చే అగ్గితెగుళ్లను రైతులు సంరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని వరి క్షేత్రాలను గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అగ్గి తెగులు సోకిన వరి పంటకు ఐసోప్రోతాలిన్ ఎకరాన 400 మిల్లీలీటర్లు మందును పిచికారీ చేయాలని సూచించారు. ఉల్లి తెగుళ్లకు పిప్రోనిల్ 6జీ గులికలు 4 కిలోలు ఎకరాన, 3జీ గులికలు 8 కిలోలు వేయాలని సూచించారు. రైతులు ఇసాయిపేట రాజు, గోవిందు రమేష్, బాల్ దేవ్ రాజు, ఎర్రోళ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ స్నేహితుడి ప్రాణం తీసిన అప్పు

- అప్పు తీసుకున్న డబ్బులు అడిగినందుకు హత్య
- మర్డర్ కేసు ఛేదించి వివరాలు వెల్లడించిన పోలీసులు

నవతెలంగాణ-నందిపేట్

స్నేహితుడు ఆపదలో ఉన్నాడని ఆదుకునేందుకు అడిగిన వెంటనే డబ్బు అప్పుగా ఇచ్చాడు. తిరిగి డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు ప్రాణ స్నేహితుడినే హతమార్చిన ఉదాంతాం వెలుగుజూసింది. గతేడాది డిసెంబర్ నెలలో నందిపేట్ మండలం ఉమ్మెడ గ్రామనికి చెందిన శ్రీకాంత్ హత్యా కేసును ఛేదించినట్లు తెలిపారు. బుధవారం ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.

మండలంలోని ఉమ్మెడ గ్రామానికి చెందిన ఎర్రగట్ల శ్రీకాంత్ (25) కనబడుటలేదని అతని అన్న నవంబర్ 30వ తేదీనా ఫిర్యాదు చేయడంతో ఎస్సై శ్రీకాంత్ మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. డిసెంబర్ 3వ తేదీనా మతుడి బైక్ బ్రిడ్జి దగ్గర ఉండడంతో దీంతో గోదావరి తీరంలో వెతకడంతో సమీపంలో మతదేహం లభించింది. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీంట్లో భాగంగా బుధవారం ఉదయం మతుడి స్నేహితుడైన నాగం భోజేందర్‌ను నందిపేట్ బస్టాండ్‌లో పట్టుకొని విచారించగా అసలు విషయం వెల్లడించారు. శ్రీకాంత్ దగ్గర ఎవరికి తెలియకుండా 2 లక్షలు రూపాయలు భోజేందర్ అప్పుగా తీసుకున్నాడు. దుబాయ్ నుండి తిరిగి వచ్చిన శ్రీకాంత్.. రాగానే తన డబ్బులు తనకు ఇవ్వమని ఒత్తిడి చేయడంతో అతనిని హత్య చేస్తే డబ్బులు ఇవ్వాల్సిన పని ఉండదని పథకం పన్నాడు. నవంబర్ 30వ తేదీనా సాయంత్రం 6.30 గంటల సమయంలో ఫోన్ చేసి గోదావరి నది బ్రిడ్జి వద్దకు రమ్మని పిలిచాడు. అతను వచ్చిన తర్వాత బ్రిడ్జి గోడపై కూర్చోని మాట్లాడు తున్న సమయంలో అనుకున్న ప్రకారం శ్రీకాంత్ ను నదిలోకి నెట్టివేసి మతుడి బైక్ అక్కడే వదిలేసి అందరూ ఆత్మహత్య అనుకోవాలని అక్కడి నుండి పారిపోయాడు. విచారణలో భాగంగా నిందితుడిని అరెస్టు చేసినట్టు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, ఎస్ఐ 2 అరిపోద్దిన్, ఏఎస్ఐ రాజేందర్, పిసి.ముత్యం, విట్టల్, గంగ నర్సయ్యను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

తల్లీకూతురు అదృశ్యం



నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని ఖానాపూర్ కు చెందిన యువతి అదృశ్యమైనట్టు ఎస్ఐ లింబాద్రి తెలిపారు. లావణ్య (22) తన మూడేళ్ల కూతురును తీసుకొని ఈనెల ఒకటిన దుస్తుల కోసం నిజామాబాద్ కు వెళ్తానని చెప్పింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికిన ఆచూకీ తెలియలేదు. భర్త శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు నిజామాబాద్ రూరల్ ఎస్ఐ లింబాద్రి బుధవారం తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని మృతదేహం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని పులాంగ్ సమీపంలో ఉన్న మెట్రో ఫుట్వేర్ షాప్ ఎదుట బుధవారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగో టౌన్ ఎస్ఐ సందీప్ సంఘటనా స్థలానికి చేరుకొని ఎవరు గుర్తించకపోవడం గుర్తు తెలియని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడి వివరాలు తెలియలేవని ఒకవేళ ఫొటోలో ఉన్న వ్యక్తిని గుర్తిస్తే నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సందీప్ కుమార్ 87126 59840 నెంబర్‌కు తెలపాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంలో చత్తీస్‌ఘడ్ యువకుడు మృతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బొంకన్ పల్లి గ్రామంలో బోర్వెల్ బండి ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ యాదగిరి గౌడ్ వివరాల ప్రకారం... బోర్‌వెల్స్ వాహనం రివర్స్ చేసే సమయంలో వేగంగా రావడంతో ఛత్తీఘడ్‌కు చెందిన వర్కర్ సమూర్ సింగ్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ సురేందర్ అతివేగంగా నడపటం తో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. బోర్ వెల్ మునిమ్ రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించమని అన్నారు.

కారు బోల్తా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైదరాబాద్ నుండ నిజామాబాద్‌కు వెళుతున్న ఒక కారు మార్గ మధ్యంలోని ఇందల్ వాయి మండలంలోని చంద్రాయాన్ పల్లి గ్రామ శివారులోని హర్యానా దాబా వద్ద ఆల్టో 800 కారు ప్రమాద వశాత్తూ బోల్తా పడింది. ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న టోల్ ప్లాజా సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి ఆల్టో కారును బయటకు తీశారు.

మేకల దొంగకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగింత

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో మేకల దొంగకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ అనే వ్యక్తి రెండు మేకలను తీసుకువచ్చి స్థానిక మటన్ మార్కెట్ వద్ద విక్రయించేందుకు ప్రయత్నించగా, మటన్ వ్యాపారులకు అనుమానం వచ్చి ఆరా తీయగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో గడ్డం కృష్ణను చితకబాది స్తంభానికి కట్టివేశారు. దీంతో తాను మేకలను దొంగతనం చేసి తీసుకువచ్చినట్టు చెప్పడంతో స్థానికులు పోలీసులకు అప్పగించారు.

కాలిపోయిన మొక్కలు



- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కాళోజీవాడీ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు కొందరు నిప్పుపెట్టినా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కాలిన మొక్కల ప్రదేశంలో కొత్త మొక్కలు నాటాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు ఉన్నా సంబధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి కాలిన మొక్కలను తీసేసి కొత్త మొక్కలు నాటాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కౌన్సిలర్లు



ఎమ్మెల్యేతో కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్‌ను బుధవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి వార్డులలో ఉన్న సమస్యలపై, ఇప్పటివరకు చేసిన అభివృద్ధి పై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌన్సిలర్లతో మాట్లాడుతూ.. అభివృద్ధి పనులలో మున్సిపల్ పాలకవర్గ కౌన్సిలర్స్ అందరూ కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకొని సమిష్టిగా పనిచేయడం వలన ఇప్పటివరకు ఎల్లారెడ్డిలో చేసిన అభివృద్ధి కంటే రాబోయే రోజుల్లో మరెక్కువ అభివృద్ధిని, అద్భుతమైన ప్రగతిని సుపరిపాలనను ప్రజలకు అందించవచ్చని వారిని ప్రోత్సహించారు.

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఎడపల్లి

కంటి వెలుగు పథకాన్ని కంటిచూపుతో బాధపడుతున్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్య నిపుణులు శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ బట్టు హన్మండ్లు, ఎంపీటీసీ సభ్యురాలు వనజ నాగరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, టీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు హసేన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకురాలు భారతి, కంటి వెలుగు డీఈఓ ప్రశాంత్, ఎంఎల్‌హెచ్‌పీఎస్ వైద్యురాలు శైలజ, ఆశావర్కర్లు కవిత, సవిత, లత, సరిత స్థానిక వీఆర్‌ఏ లతా, బిల్ కలెక్టర్ పద్మావతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో దశరథ్, సర్పంచ్ తిరుమలరెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ తిరుమలరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసి ఆదుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఉపసర్పంచ్ విట్టల్, కండేరావు పటేల్, ఆయా గ్రామాల లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని దగ్గి గ్రామంలో కంటి వెలుగు క్యాంపును ఎంపీపీ గైని అనుసూయ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు క్యాంపును గ్రామంలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కమిలి నర్సింలు, సర్పంచ్ సుందరమ్మ, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేందర్‌రెడ్డి, డాక్టర్ అస్మా అఫ్రిన్, ఏఎన్ఎం జ్యోతి, నాయకులు రమేష్, ప్రభాకర్, లింగారెడ్డి, ఆశాలు లక్ష్మీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయ గర్భగుడికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామ శివారులో గల పోట్ల గుట్ట వెంకటేశ్వర స్వామి గర్భగుడి ఆలయానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ గుడి నిర్మాణానికి దేవాదాయ శాఖ, తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ శాసనసభ సభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ 12 లక్షల రూపాయలు మంజూరు చేయించారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ అసిస్టెంట్ ఇంజనీర్ బి రమేష్, హుస్సేన్ నగర్ గ్రామ సర్పంచ్ దానేమ్ లక్ష్మీ తిరుపతి, ఉప సర్పంచ్ మోతె దేవేందర్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తినేటి నర్సారెడ్డి, మోతె చిన్న రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పీఈటీ, పండితులకు ప్రమోషన్ కల్పించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్/మాక్లూర్

తెలంగాణ రాష్ట్ర పీఈటీ, పండితుల జేఏసీ ఆదేశాల మేరకు బుధవారం నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి, కమ్మర్‌పల్లి, సిరికొండ, నందిపేట్, నవీపేట్ తదతర మండలాల్లో స్కూళ్లలో నల్ల బ్యాడ్జీలతో పీఈటీ, పండితులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నిజామాబాద్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిలా అధ్యక్షులు టీ విద్యాసాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పీఈటీ, పండితులను అప్‌గ్రేడేషన్ చేయాలని కోరారు.

నల్ల బ్యాడ్జీలతో భాషా పండితుల నిరసన

మాక్లూర్ : మండలంలోని గంగరమంద గ్రామంలోని పాఠశాలలో బుధవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి రమణాచారి నల్ల బ్యాడ్జితో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మహాసభల్లో 2017లో వేదిక పై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చి 2,3 జి ఓ లను ఇచ్చారన్నారు. వాటిని అమలుపరిచి తెలుగు, హింది, ఉర్దూ భాష పండితులకు, పీఈటీలకు పదోన్నతులు ఇవ్వడం లేదని అన్నారు. ఇప్పుడు జరిగే పదోన్నతులు, బదిలీలు షెడ్యూల్లో కోర్టు కేసు ఎత్తివేయించి పదోన్నతులు ఇవ్వాలని కోరారు.



కంఠేశ్వర్ : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని చేంగల్, గోన్‌గొప్పుల, బడా భీంగల్ గ్రామాల్లోని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు , సర్పంచ్‌లు గంగారెడ్డి, అనసూయ, సంజీవ్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతకింది బావాయి, ఎంపిటీసిలు శ్రీరామ్ ప్రమీల, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బుర్కి చిన్న గంగాధర్ గౌడ్, రాగుల మోహన్, కొమ్ము సరేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాల్కల్‌లో కంటివెలుగు విజయవంతం

నవతెలంగాణ-మోపాల్

న్యాల్కల్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ లింగంనాయక్ మాట్లాడుతూ.. వందశాతం టార్గెట్ పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగా ప్రసాద్, ఉప సర్పంచ్ సతీష్ కుమార్, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, అంగన్వాడీ, ఐకేపి సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మన ఊరు-మనబడి పనులను పూర్తి చేయాలి

- డీఆర్‌డీఏ, డీఆర్‌డీఓ పీడీ చందర్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా మిగిలి ఉన్న పనులను వెంటనే త్వరతగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని డీఆర్డీఏ, డీఆర్డీఓ పీడీ చందర్ నాయక్ అన్నారు. మంగళవారం ఎండలంలోని మెంట్రాస్‌పల్లి గ్రామంలోని మన ఊరు మనబడి పనులను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ చందర్ నాయక్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తు పనులను త్వరత గతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. అయన వెంట ఎంపీడీఓ గోపి బాబు, పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్ షేక్ అసిఫొద్దీన్ అధ్యాపకులు ఉన్నారు.

దోమల బెడద నుండి రక్షించాలి

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలో దోమల నుండి రక్షించాలని బిజెపి నవీపేట్ శాఖ ఆధ్వర్యంలో కార్యదర్శికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో దోమల బెడద తీవ్రంగా ఉందని, దోమలు కుట్టడంతో పిల్లలతో పాటు వృద్ధులు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. వెంటనే దోమల నివారణ మందులను పిచికారి చేయాలని తెలిపారు. లేకుంటే ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాధా, నాయకులు గణేష్, బాల గంగాధర్, రాజేందర్, రాము, బండారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన జుల గంగారాంకు రూ. 32, 500, కట్ట గంగారాంకు రూ.16 వేలు, నర్రా లక్ష్మికి రూ.20 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ చెక్కులను బుధవారం లబ్దిదారులకు సర్పంచ్ సక్కారం అశోక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ బోడ దేవేందర్, బి.ఎన్ మోహన్, తోట అప్పయ్య, భూమేశ్వర్, భాశెట్టి గంగాధర్, ఏ. శ్రీనివాస్, బందెల రాజు, అబ్బాష్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మేయర్, కార్పొరేటర్లు



కలెక్టర్‌తో మేయర్, కౌన్సిలర్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, కార్పొరేటర్లు కలిసి పుష్పం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ చిత్ర మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి స్ట్రీట్ కార్నర్ సమావేశాలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 10 నుండి 25వ వరకు ఆయా శక్తి కేంద్రాల పరిధిలో స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు నిర్వహిస్తున్నట్లు బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ తెలిపారు. ఎంపీ కార్యాలయం పెర్కిట్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పట్టణంలో ఉన్న శక్తి కేంద్ర పరిధిలో స్ట్రీట్ మీటింగ్ ప్రణాళికను రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి శక్తి కేంద్ర ఇంచార్జులదే పూర్తి బాధ్యతని అన్నారు. సమావేశంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజు, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పోల్కం వేణు, పట్టణ ఉపాధ్యక్షులు పాన్ శీను, భూసం ప్రతాప్, కార్యదర్శి ఖాందేశ్ ప్రశాంత్ ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించిన జెడ్పి చైర్మన్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నపూర్ గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని జిల్లా జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామ మహిళ భవనాన్ని ప్రారంభించారు. కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీఓ క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ ప్రకాష్, స్థానిక సర్పంచ్ లక్ష్మీ గంగారెడ్డి, ఎంపీటీసి లు సత్యనారాయణ, ఒడ్డెన్న, ఏపీఎం అనీల్, బిఆర్ఎస్ నాయకులు సుక్కి సుధాకర్, శేఖర్ రావు, గంగారెడ్డి, సుమన్, మహిళా మండలి అధ్యక్షురాలు సుమలత పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులకు మార్కింగ్

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బాచన్‌పల్లి గ్రామంలోని కొండయ్యకోట వద్ద నిర్మించే హనుమాన్ ఆలయ నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ ఆకుల కవిత గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య ఆధ్వర్యంలో మార్కింగ్ చేశారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎండోమెంట్ ద్వారా 24 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు రణధీర్, వీడిసి అధ్యక్షుడు బొమ్మిడి ఈశ్వర్, దేవాలయ కమీటీ అధ్యక్షుడు గాండ్ల నవీన్ కమీటీ సభ్యులు వన్నెల జనార్ధన్, మంతెన లింబయ్య, కుమ్మరి మల్లేష్, వన్నెల గంగాధర్, తదితరులు ఉన్నారు

శివరాత్రికి వేములవాడకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆర్మూర్

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఆర్మూర్ నుండి వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కవిత తెలిపారు. ఈనెల 17 నుండి 19 వరకు ఆర్మూర్, పెర్కిట్, మోర్తాడ్, కమ్మర్‌పలి నుండి స్పెషల్ బస్సులు వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి నడుతున్నట్టు చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్

- కార్మికుని మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు.
- కంటైనర్‌ను పట్టుకున్న ప్లాజా సిబ్బంది

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రోజువారీగా జాతీయ రహదారి 44 వద్ద మొక్కలు నాటిన అనంతరం ట్రాక్టర్‌లో ముగ్గురు కార్మికులు ఇంటికి వస్తుండగా ఇందల్వాయి టోల్ ప్లాజా పరిధిలోని సదాశినగర్ మండలం లోని దగ్గి అటవీ ప్రాంతంలో వెనుక నుండి వచ్చిన ఒక కంటైనర్ ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈఘటనలో ట్రాక్టర్ పై ఉన్న ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామనికి చెందిన ధర్పల్లి కిషన్ అక్కడి కక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. టోల్ ప్లాజా సిబ్బంది, స్థానికుల వివరాల ప్రకారం... టోల్ ప్లాజాలో కార్మికునిగా ఉన్న ధర్పల్లి కిషన్. దేవితండాకు చెందిన రవీందర్ నాయక్, చంద్రాయన్‌పల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ భూమయ్య పనులు ముగించుకొని ట్రాక్టర్‌పై టోల్ ప్లాజా వైపు వస్తున్నారు. కామారెడ్డి నుండి ఆర్మూర్ వైపు వెళ్తున్న ఒక కంటైనర్ ఢీ కొనడంతో ట్రాక్టర్ పై ఉన్న కిషన్ కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా రవీందర్ నాయక్, భూమయ్య లకు తీవ్ర గాయాలు కావడంతో టోల్ ప్లాజా హైవే అంబులెన్స్‌లో నిజామాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. కంటైనర్ ఆగకుండా వేగంగా వెళ్లిపోవడంతో దాని వెనకలే ఉన్న ఒక కారువారు గమనించి వెంటనే టోల్ ప్లాజా మేనేజర్ చలపతిరావు, సిబ్బందికి సమాచారం అందజేయడంతో టోల్ ప్లాజా సిబ్బంది కంటైనర్‌ను పట్టుకున్నారు. డ్రైవరు, క్లీనర్ పారిపోతుండగా సిబ్బంది వెంబడి వారిని పట్టుకుని సదాశివ నగర్ పోలీసులకు అప్పగించినట్లు టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.